తిన్న రేవు తల్వాలె

- మంచి చేసినోళ్లను మేం మర్చిపోం
- నలభై ఏండ్ల కాంగ్రెస్ పాలన.. పదేండ్ల బీఆర్ఎస్ పాలన చూసినం
- నాడు అరిగోస పడ్డం.. నేడు సంబురంగా ఉన్నం
- కేసీఆర్‌తోనే మా జీవితాలు బాగుపడ్డయ్
- మాకు అండగా నిలిచిన కేసీఆర్ వెంటే ఉంటం
- స్పష్టం చేసిన జిల్లా రైతులు

కరీంనగర్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నాటి పాలనలో కుదేలైన ఎవుసాన్ని పండుగలా చేసి, రైతును వెన్నుదన్నుగా నిలిచింది రైతుబిడ్డ ముఖ్యమంత్రి కేసీఆరేనని కర్షకులు కొనియాడుతున్నారు. పదేండ్లలోనే 24గంటల కరెంట్, సాగునీరు, రైతుబంధు ఇచ్చి ఆసరా అయ్యారని, ధరణి పోర్టల్ తెచ్చి భూములకు భద్రత కల్పించారని ప్రశంసిస్తున్నారు. నాడు అరిగోస పెట్టిన కాంగ్రెస్ ఇప్పుడు మళ్లీ ఆగం చేయాలని చూస్తున్నదని ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ రాక ముందు దుర్భర పరిస్థితులు అనుభవించామని, ఆ నాడు వ్యవసాయరంగం పూర్తిగా ఆగమైందని నాటి రోజులను గుర్తు చేస్తున్నారు. కరెంట్ ఆరుగంటలని చెప్పినా మూడు గంటలు కూడా వచ్చేది కాదని, అది ఎప్పుడొచ్చేదో ఎప్పుడు పోయేదో కూడా తెలిసేది కాదని, అచ్చే కరెంట్ కోసం పొద్దంతా పడిగాపులు కాసేదని, రాత్రి పూట పొలాల వద్దకు ఎంతో మంది రైతులు విషకీటకాలు కుట్టో.. కరెంట్ షాక్‌లతోనో చనిపోయారని, ఆ రోజులు మళ్లీ రావద్దని తల్చుకున్నారు. గోదావరి జలాలు సముద్రం పాలైనా చుక్క నీటిని ఒడిసిపట్టలేదని, సాగునీటి వసతి లేక పంటలు ఎండుతున్నా.. భూములు బీళ్లుగా మారుతున్నా పట్టించుకోలేదని మండిపడుతున్నారు. చివరకు అప్పుల్లో చిక్కుకున్నా, ఆ అప్పుల బారి నుంచి బయటపడలేక ఆత్మహత్యలు చేసుకున్నా.. వలస బాట పట్టినా.. కుటుంబాలు రోడ్డున పడినా కనీసం సాయం అందలేదని, ఇంకా ఆ రోజులు కండ్ల ముందే ఉన్నాయని యాది చేసుకున్నారు. నాడు భూములకు రక్షణ ఉండేది కాదని, ఎప్పుడు గొడవలే ఉండేవని, దళారులదే రాజ్యం నడిచేదని వివరిస్తున్నారు. లంచాలు ఇవ్వనిదే ఏ పని అయ్యేది కాదని, యజమానులకు తెలియకుండానే రికార్డులు తారుమారు చేసే పరిస్థితి ఉండేదని, ఏ రికార్డులు మార్చిన అసలైన వారికి తెలిసేది కాదంటున్నారు. రిజిస్ట్రేషన్ కావాలన్నా రోజులు పట్టేదని, పట్టాలు కావాలంటే ఆఫీసుల చుట్టు తిరగాల్సి వచ్చేదని, భూ తగాదాలతో పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగే దుస్థితి ఉండేదని వాపోతున్నారు. కానీ, స్వరాష్ట్రంలో పరిస్థితులన్నీ మారాయని, అన్నదాతలకు మంచి రోజులు వచ్చాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యమ సమయంలో రైతుల కష్టాలను కండ్లారా చూసిన కేసీఆర్ సీఎం అయిన తర్వాత ఎవుసం బాగుపడిందని చెబుతున్నారు. 24గంటల నాణ్యమైన కరెంట్ వస్తున్నదని, ప్రాజెక్టుల నిర్మాణంతో పుష్కలంగా జలాలు వస్తున్నాయని, పంటలు మంచిగా పండుతున్నాయని, రైతుబంధుతో పంట పెట్టుబడి కష్టాలు తీరాయని సంతోష పడుతున్నారు. రైతు ఎలా చనిపోయినా రైతు బీమా కింద సాయం అందిస్తూ కుటుంబాలకు ఆసరా అవుతున్నారని అంటున్నారు. ఇంకా ధరణి పోర్టల్ తెచ్చి వ్యవసాయ భూములకు రక్షణ కల్పించి వివాదాలు లేకుండా చేశారని, నిమిషాల్లోనే భూములు రిజిస్ట్రేషన్ అవుతున్నాయని, పత్రాలు ఇంటికే వస్తున్నాయని చెబుతున్నారు. భూమి వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంటున్నాయని, క్షణాల్లో తెలుసుకోవచ్చని, అలాగే యజమానికి తెలియకుండా భూమి ఎట్టి పరిస్థితుల్లో ఇతరుల పేరుపైకి మారదని స్పష్టం చేస్తున్నారు. రైతులందరూ మంచిగున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నలభై ఏండ్ల పాలనలో తమ బాధలు ఏనాడూ పట్టించుకోలేదని, పైగా అరిగోసపెట్టిందని మండిపడుతున్నారు. ఇప్పుడొచ్చి మూడు గంటల కరెంటే సరిపోతుందని, అది ఎలా సాధ్యమంటే 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని, రైతు బంధు దుబారా అని, ధరణిని బంగాళా ఖాతంలో వేస్తామంటూ పూటకో మాట మాట్లాడుతూ పరేషాన్ చేస్తున్నారని ఆగ్రహించారు. వాళ్లను నమ్మితే మళ్లీ పాత రోజులే వస్తాయని, కారు చీకట్లు కమ్ముకుంటాయని, ఉచిత కరెంట్ పోతుందని అన్నదాతల బతుకులు ఆగమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరణి రద్దయితే పాత వ్యవస్థ వస్తుందని, ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో భూ సమస్యలు, కొట్లాటలు మొదలవుతాయని భయపడుతున్నారు. అందుకే కాంగ్రెస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రానివ్వద్దని, కరెంట్, నీళ్లకు ఏబాధా లేకుండా చేసిన కేసీఆర్ వెంటే తాముంటామని చెబుతున్నారు. అన్నదాతలు తిన్న రేవు మరువరని, తమకు మేలు చేసిన కేసీఆర్‌కు అండగా ఉంటారని స్ప ష్టం చేస్తున్నారు.

ఇప్పుడున్న కరెంటే మంచిగున్నది..

గతంలో కంటే ఇప్పుడున్న కరెంటే మంచిగున్నది. ఎప్పుడంటే అప్పుడు బావికాడికిపోయి పొలానికి నీళ్లు పెట్టుకుంటున్నం. కాంగ్రెసోళ్లు ఉన్నప్పుడైతే రాత్రి, పగలు టైం పెట్టి కరెంటు ఇచ్చేటోళ్లు. దీంతో కరెంటు కోసం తిప్పలపడేటోళ్లం. సగం మడి పారకముందే కరెంటుపోయేది. పారిందే మళ్ల పారే సరికి కొసమడి పారకపోయేది. గిట్ల చాలా రోజులు కష్టాలు ఎల్లదీసినాం. వానింట మన్ను వడ గింత గోస పెడుతండనుకుని బాధ పడ్డం. ఏదో తెలంగాణ వచ్చినంక కరెంటు గోస తీరింది. 24గంటల కరెంటు ఇత్తండు. నాడే కరెంటు ఇయ్యనోడు ఇయ్యాల మళ్లచ్చి ఓటడిగితే ఎట్లేత్తం. మూడు గంటలు సాలని ఇప్పుడే గిట్లంటుండు. వచ్చినంక ఎంత గోసపెడతడో ఏమో. 10హెచ్‌పీల మోటరు పెట్టి పోత్తే బాయిలల్ల నీళ్లుండద్దా? ఉన్న నీళ్లు గుంజిపోత్తే రామగోస అయితది. కాంగ్రెసోన్ని నమ్ముకుంటే ఇగ మన్నుబుక్కుడే. ఎవుసం గురించి తెలువనోళ్లకు రాజ్యం చేతిలో పెడితే రైతుకు సావుమరణమే. బాగా ఆలోచించి ఓటేత్తం. మాకు మంచి జేసినోళ్లను మరిచి పోం. సీఎం కేసీఆర్ అచ్చినప్పటి నుంచి కరెంటుతో కష్టాలు తీరినయ్. నీళ్ల తిప్పలు, కరెంటు తిప్పలు లేకుండాపోయినయ్. నాకున్న ఐదెకరాల్లో పంటలు సాగు చేస్తున్నాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటలు పండిస్తున్నం. ఎప్పుడు ఇలానే ఉండాలని కోరుకుంటున్నం. మళ్ల కేసీఆర్ సారే సీఎం కావాలి.

- చుక్కాల రమ, మహిళా రైతు, బావుసాయిపేట (కోనరావుపేట)

గిప్పడే పూటకోటి మాట్లాడవట్టె..

రేవంత్‌రెడ్డి పెట్టుబడి సాయంపై పూటకో మాట మార్చుతూ అన్ని మోసపు మాటలు చెబుతున్నరు. తెలంగాణ రాక ముందు ఇక్కడి ప్రజలు పడ్డ కష్టాలను రైతులు ఇంకా మర్చిపోలేదు. ఇక్కడ సంతోషంగా ఉన్న రైతుల మధ్య చిచ్చు పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలుజేత్తున్నది. ధరణి తీసేసి కౌలుదారులు, అనుభవదారులు కాలం అంటూ రెవెన్యూ వ్యవస్థను మొదటికి తీసుకువస్తమంటున్నరు. పెట్టుబడి సాయం విషయంలో వారికి స్పష్టత లేదు. రైతులను ఏ విధంగా ఆదుకుంటరు. పెట్టుబడి సాయం అప్పుడే రైతు యజమానికి అంటరు. అప్పుడే కౌలు రైతుకు అంటరు. అసలు వారి హామీలపై వారికే గ్యారెంటీలేదు. ఎవుసంపై అవగాహన లేకుండా రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెసోళ్లు ఎన్ని ముచట్లుజెప్పిన ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. బీఆర్ఎస్ పాలనలో 24గంటల ఉచిత కరెంటుతోపాటు సమయానికి పెట్టుబడి సాయం అందడంతో రైతులు సంతోషంగా సాగుజేత్తున్నరు.

- నోముల జనార్దన్‌రెడ్డి, రైతు (రుద్రంగి)

ధరణి తీసేస్తే రైతుబంధు డబ్బులు ఎలా వస్తయి

తెలంగాణలో ధరణి వచ్చినంక రైతులకు పూర్తి భరోసా దొరికింది. అక్రమంగా ఒకరి భూమిని మరొకరి పైరు మీదకు మార్చడం లాంటి చర్యలకు అడ్డుకట్ట పడింది. ఇలాంటి ధరణిని తీసేస్తే మళ్లా దళారుల పెత్తనం మొదలవుతుంది. తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ తెచ్చిన ధరణితో మా భూములు భద్రంగా ఉన్నాయి. రైతుబంధు డబ్బులు మా ఖాతాలో జమవుతున్నాయి. మళ్లీ రైతులను ఇబ్బందులపాలు చేసేందుకే కాంగ్రెసోళ్లు ధరణి తీసేస్తామంటున్నరు. ఇట్లయితే రైతుబంధు డబ్బులు ఎలా వస్తయి. భూములు ఒకరికి మరొకరు దున్నుకుంటారు.కాంగ్రెసోళ్లకు గుణపాఠం చెప్పాలి.

-కొమ్మెర భూపతిరెడ్డి, రైతు గునుకులపల్లి(చిగురుమామిడి)

మూడు గంటలే ఇత్తే పొలాలన్నీ బీడువడుతయి..

కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటే ఇస్తామనవట్టె. గట్లయితే ఇప్పుడు సాగుజేత్తున్న పొలాలన్నీ మళ్ల బీడువడుతయి. నాకు గంభీరావుపేట, నర్మాల శివారులో మూడెకరాల పొలమున్నది. కేసీఆర్ సార్ వచ్చినంకా నీళ్లకు ఇబ్బంది లేకుండాలేదు. ఒక బోరు మస్తుపోతాంది. కరెంటు ఫుల్లు ఉండవట్టె. కేసీఆర్ సారు పుణ్యమా అని రైతులు రందీలేకుండా ఎవుసంజేసుకోవట్టె. టైముకు తింటున్నం. నిద్రపోతున్నం. భరోసాగా బతుకుతున్నం. కానీ కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటే ఇత్తమంటే ఎకరం పొలమన్న పారుతదా? మునుపు కరెంటు సక్కగుండ చానా ఇబ్బందిపడితిమి. మళ్లీ గిప్పుడొచ్చి మూడు గంటలే ఇస్తం. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలె అనవడితిరి. వాళ్లు వద్దు.. వాళ్ల మూడుగంటల కరెంటు వద్దు. మళ్ల కేసీఆర్‌నే గెలిపించుకుంటం.

-చిట్టంపల్లి రాజు, నర్మాల (సిరిసిల్ల)

మాకు మేలుజేత్తున్న కేసీఆర్‌ను ఎప్పటికీ మరువం..

కాంగ్రెస్ పాలనలో ఎవుసంజేసేందుకు నరకంజూసినం. నీళ్లు లేకా, కరెంటు రాక అవస్థలుపడ్డం. టార్చిలైట్లు పెట్టుకొని రాత్రులు బావికాడికిపోయినం. మా పొలాలు పదిర శివారులో ఉండేటివి. అప్పుడు కరెంటు పక్కపొంటి మండలంలో (రామలక్ష్మణపల్లి గ్రామం) వేరే టైంలా వచ్చేది. మా కరెంటు పోయినకం వాళ్లను బతిమిలాడి మళ్లీ వైర్లు తీసుకోపోయి వాటికి కలుపుకొని ఆట్లో రెండు గంటలు పండించుకోనే వాళ్లం. పొలానికి నీళ్లు పారించాలంటే పనులన్నీ వదులుకోని అక్కడే ఉండే వాళ్లం. అయినగానీ వేసిన పంట చేతికివత్తదనే నమ్మకం లేకుండె. అప్పుడు రైతుల కష్టం ఎవరికీ చెప్పుకోవాలో తెలియకుంటుండె. ఆ కాలం ఓ పీడకలలా అనియ్యవట్టె. గంతగానం బాధలుపడ్డం.. మళ్లీ అలాంటి స్థితిని తెచ్చుకోము. వాళ్లకు రైతులను ఎలా సాదుకోవాల్నో తెలియదు. మానెత్తి మీద మేమే బస్మాసురహస్తం పెట్టుకోవాలనుకోం. 24గంటల కరెంటు ఉచితంగా వస్తుంది ఇప్పుడు నీళ్లు పారించనికి రైతులకు ఇబ్బందుల్లేవు. ఎప్పుడైన వెళ్లి పారించుకోవచ్చు. రైతులకు మేలు చేసిన కేసీఆర్‌ను ఎప్పటికీ మేము మరువం.

- ఉప్పల రాజిరెడ్డి, రైతు, హరిదాస్‌నగర్ (తెలంగాణ చౌక్)

ధరణితోనే రైతులకు మేలు

కాంగ్రెసోళ్లప్పుడూ భూములు అమ్మాలన్న, కొనాలన్న వేములవాడలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో భూమి రిజిస్ట్రేషన్ చేసుకునేటోళ్లం. అక్కడికి వెళ్తే రోజంతా పోయేది. ఇప్పుడు 10 నిమిషాల్లో భూమి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నం. కాంగ్రెస్ ధరణి తీసేసి భూమాత పోర్టల్ ఏర్పాటు చేస్తామని చెప్పి రైతులను ఆగమాగం చేస్తుంది. ఇప్పుడున్న ధరణి పోర్టల్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. తహసీల్దార్ కార్యాలయాల్లో భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి అవుతుంది. వెంటనే వేలిముద్రల ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తయి పాస్‌బుక్‌లో పేరు ఎక్కించి, పోస్టు ద్వారా ఇంటికి పంపిస్తున్రు. అసోంటి మంచిగున్న ధరణిని తీసేస్తమంటున్రు. గసొంటి కాంగ్రెస్ మనకు అవసరమా..? ధరణి వద్దంటున్న.. కాంగ్రెస్సే మాకద్దు. మేం మళ్ల బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటం.

- గొల్లెం నర్సింగ్, రైతు(రుద్రంగి)

రైతుల నోట్ల మట్టికొట్టేందుకే..

కాంగ్రెస్ హయంలో ఏడు గంటల కరెంటు ఇస్తున్నపుడు మోటర్లు ఆగుతుండె. మళ్ల మోటర్లు నడవాలంటే మోటరు కాడా కుండి నింపుకొని, నీళ్లు కుండతో మళ్లీ మోటార్లలో నింపితే మో టరు నడిసేది. తెలంగాణ వచ్చినంక 24గంటల కరెంటు వస్తుంది. ఎలాంటి తిప్పలు లేకుండా మోటర్లను నడిపించుకుంటు న్నాం. ఇప్పుడు మంచిగ ఎవుసంజేసుకుంటున్నాం.కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటు సరిపోదా అంటున్నరు. మాకు 24 గంటల కరెంటు తప్పకుండా అవుసరమే. లేకుంటే మళ్ల ఎనుకటి కాలం వస్తది. కాంగ్రెస్ వస్తే రైతుల నోట్ల మట్టికొట్టుడే.

- బైరగోని మల్లయ్యగౌడ్, రైతు, బావుసాయిపేట(కోనరావుపేట)

తహసీల్ ఆఫీసు చుట్టూ తిరగాల్సి వస్తది

ధరణి పోర్టల్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. స్లాట్ బుక్ చేసిన వెంటనే తహసీల్ ఆఫీసులో భూమి రిజిస్ట్రేషన్ చేసి మ్యుటేషన్, పాసు పుస్తకం ఇస్తున్నరు. కాంగ్రెస్ నాయకులు భూమాత పోర్టల్ తీసుకువస్తే పాత పద్ధతిలో పట్వారీ, గిర్దవార్లు, తహసీల్ ఆఫీసు చుట్టూ తిరగాల్సి వస్తది. భూములకు భద్రత కూడా ఉండదు. ఒకరి భూమి మరొకరి పేరుపై మారుస్తరు. కాంగ్రెస్ నాయకులకు అవగాహన లేకుండా మాట్లాడుతున్నరు.

-సోమిరెడ్డి మునీరెడ్డి, జూబ్లీనగర్, (కరీంనగర్ రూరల్ మండలం)

లంచం ఇస్తేనే పట్టాలు పాస్‌బుక్‌లు వచ్చేవి

తెలంగాణ ప్రభుత్వం ధరణి తీసుకువచ్చినప్పటి నుంచి రైతులకు ఎలాంటి కష్టాలు లేవు. అంతకుముందు పట్వారీ వ్యవస్థ ఉన్నప్పుడు భూముల పట్టాలు కావాలంటే ఏండ్ల తరబడి తిరిగేవాళ్లం. పట్టాలు అయినంక పాస్‌బుక్‌లు ఇవ్వకపోయేది. లంచం ఇస్తేనే పట్టాలు పాస్ బుక్‌లు వచ్చేవి. కానీ, ధరణి వచ్చినప్పటి నుంచి ఎలాంటి కష్టాలు లేకుండా ఒక్క రోజులోనే పట్టా అవుతుంది. పాత పాస్ బుక్ ఉంటే వెంటనే పట్టాచేసుకున్న సర్వేనంబర్‌ను ఎక్కిస్తున్నరు. ప్రొసీడింగ్ కాపీ ఇస్తున్నారు. కొత్త పాస్ బుక్ కావాలంటే వారం లేక పది రోజుల్లో పోస్టులోనే ఇంటికి వస్తున్నాయి. కాంగ్రెస్ వాళ్లు పాత పట్వారీ వ్యవస్థ తీసుకువస్తామంటే ఊరుకునే ప్రసక్తేలేదు.

-కాసర్ల సుధాకర్‌రెడ్డి, కందుగుల, రైతు (హుజూరాబాద్ రూరల్)

కాంగ్రెసోళ్లను నమ్మితే.. రైతు ఆత్మహత్యలు పెరుగతయి

కాంగ్రెసోళ్లు రైతుబంధు భూ యజమానికి, కౌలు రైతుకు ఎవరికన్నా ఒకరికి ఇస్తమంటున్రు. ఇద్దరికీ ఇస్తమంటలేరు. అంటే మళ్ల భూ యజమాని, కౌలు రైతు కొట్టుక చావాల్న. కౌలురైతుకే రైతు బంధు ఇస్తమంటే భూ యజమాని ఒప్పుకోడు. గట్టిగా మాట్లాడితే భూమి కౌలుకే ఇయ్యనని, పడావు ఉంచుకుంట అంటడు. అప్పుడు కౌలు రైతులకు భూమి కౌలుకు దొరకక ఆగమైతడు. కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటే అంటున్రు. ఆ కరెంట్‌తోని ఎవుసం సాగుతదా.. ఒక మడి అయిన పారుతదా. ఇట్లయితే కౌలు రైతు కౌలు కట్టలేని పరిస్థితి వస్తది. మళ్ల రైతు ఆత్మహత్యలు పెరుగతయి. కాంగ్రెసోళ్ల మాటలు వింటే.. ఎవుసం సాగక రైతులు అడ్డమీద కూలీలవుతరు. రైతులు సల్లగుంటే కాంగ్రెసోళ్ల కండ్లు మండుతున్నట్లు ఉన్నయి. అందుకే గిసొంటి గత్తర లేపే మాటలు మాట్లాడుతున్రు. మా రైతులెవరూ కాంగ్రెస్‌ను అసలు నమ్మరు. నమ్మితే నట్టేట మునుగుడే. కేసీఆర్ సార్ వచ్చినంక 24 గంటల నాణ్యమైన కరెంట్ మంచిగా ఉంటుంది. రైతు బంధు వస్తుంది. నీల్లు వచ్చినయి. మా రైతులకు ఇంతకన్నా ఇంకా ఏం కావాలి. అందుకే మళ్ల మేం కేసీఆర్ సారుకే ఓటేస్తం. మల్ల ఆయనే సీఎం అవుతడు.

- పెండ్యాల శ్రీమతి, మహిళా రైతు,చెర్లభూత్కూర్ (కరీంనగర్ రూరల్)

నాటి ఇబ్బందులు గుర్తుకు వస్తే కండ్ల పొన్న నీళ్లు వస్తయ్

ధరణి వచ్చినంక మా భూములు భద్రంగా ఉన్నయ్. ఇదివరకు వీఆర్వోలు ఇష్టం వచ్చినట్లు ఒకరి భూములు ఇంకొకరి పైరు మీది మార్చేవారు. దీంతో గొడవలు జరిగేవి. పోలీసు కేసులయ్యేవి. ఎంతో మంది జైలు పాలైన రోజులు కూడా ఉన్నాయి. భూమి పట్టాల గురించి రైతులు పడ్డ ఇబ్బందులు గుర్తుకు వస్తే కండ్ల పొన్న నీళ్లు వస్తయ్. రైతులకు వరంలా ఉన్న ధరణి తీసేస్తమంటున్న కాంగ్రెసోళ్లకు తగిన గుణపాఠం తప్పదు. అలాంటిది ఇప్పుడు ధరణితో ఆ సమస్యలు తొలగిపోయినయ్. దాన్ని కాంగ్రెసోళ్లు తొలగిస్త మంటే ఊరుకుంటమా. బీఆర్ఎస్ సర్కారు రైతులకు చేసిన మేలును మరుస్తమా?.

- రావుల వెంకట్‌రెడ్డి, కందుగుల, రైతు (హుజూరాబాద్ రూరల్)

10 హెచ్‌పీ మోటర్ల ఖర్చు ఎవడు భరిస్తడు..

కాంగ్రెసోళ్లు చెప్పే 10 హెచ్‌పీ మోటర్లు, మూడు గంటల కరెంట్‌తో రైతులకు నష్టం జరుగుతది. మా గ్రామంలో ఇప్పటివరకైతే 10 హెచ్‌పీ మోటర్లను నేను సూడలే. 10 హెచ్‌పీ మోటర్లు వాడాలంటే వాటికి మళ్ల కనెక్షన్ వేరే తీసుకోవాలి. ఇప్పుడు ఇస్తున్న మోటర్ల కరెంట్ సరఫరా కెపాసిటి పెంచాలి. గ్రామంలో 5 హెచ్‌పీ మోటర్లకు మూడు కనెక్షన్లకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఉంటది. మరీ 10 హెచ్‌పీ మోటర్లకైతే ప్రతి మోటర్‌కు ఒక ట్రాన్స్‌ఫార్మర్ పెట్టాల్సి ఉంటుంది. దానికి తగ్గట్లు డీడీలు చెల్లించాలి. మోటర్ కెపాసిటిని బట్టి బిల్లు వస్తుంది. ఉచిత కరెంట్ తీసేసి బిల్లు కట్టమంటే రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఒక వేళ పాత ట్రాన్స్‌ఫార్మర్లను అట్లనే వాడితే లోవోల్టేజీతో మోటర్లు కాలిపోతయి. మన ప్రాంతంలో 10 హెచ్‌పీ మోటర్లకు రిపేర్ చేసే మెకానిక్‌లు కూడా దొరకరు. ఇట్లయితే ఇగ ఎవుసం సాగినట్లే. ఇంత ఖర్చు రైతు ఏడ నుంచి భరిస్తడు. మూడు గంటల కరెంటు సాలంటున్రు. ఆ కరెంట్‌తో ఒక్క దొయ్య అన్న పారతదా..?కాంగ్రెసోళ్లు తలా తోక లేకుండా మాట్లాడుతున్రు. వాళ్లకేమన్న బుద్ధి ఉండాలే. కేసీఆర్ సారు ఇప్పుడిస్తున్న 24 గంటల కరెంట్‌తోని మస్తు పంటలు పండుతున్నయి. పాములు, పురుగు పూచిన భయం మాకు ఉండదు. మా ఇంటోళ్లు ఇప్పుడే రాత్రిలు కడుపు నిండ నిద్రపోతున్రు. గతంలో కాంగ్రెసోళ్లు కాలంలో కంటి పై నిద్రలేని రోజులు గడిపినం. అలాంటి రోజులు మళ్లీ రావద్దని కోరుకుంటున్నం. మళ్ల కేసీఆర్ సారే రావాలి. మేం కేసీఆర్ సారుకే ఓటేస్తం.

- పెండ్యాల అవంతిక, మహిళా రైతు, చెర్లభూత్కూర్(కరీంనగర్ రూరల్)

దళారులదే రాజ్యమత్తది

ధరణి రద్దు చేస్తే మళ్లీ దళారులదే రాజ్యమవుతుంది. వారి ఆగడాలు సురువవుతాయి. గత ప్రభుత్వాల హయాంలో వీఆర్వోలు, మధ్య దళారులు ఆగడాలతో భూ రికార్డులు మారి అక్రమాలకు పాల్పడి ఆక్రమణలకు గురయ్యేవి. సాగు చేసుకుంటున్న రైతు భూమి రికార్డుల్లో దళారుల పేరున ఎక్కేవి. సీఎం కేసీఆర్ రైతుల భూముల రక్షణకు ధరణి తెచ్చి మేలు చేసిన్రు. రైతుల భూములకు రక్షణ కలిగింది. రైతులకు మేలు చేస్తున్న ధరణిని కాంగ్రెస్ రద్దు చేస్తామనడం అన్యాయం. ప్రజలు ఊరుకోరు. మన భూములు మనకు భద్రంగా ఉండాలంటే ధరణి ఉండాలి, మళ్లీ కేసీఆర్ సీఎం కావాలి. మా మద్దతు బీఆర్ఎస్‌కే.

- చెంచు ఎల్లయ్య, రైతు, ముస్తాబాద్ (కలెక్టరేట్)

మళ్లీ దళారులు దాపురిస్తరు

ధరణి పోర్టల్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ధరణి పోర్టల్ వల్ల తహసీల్దార్ కార్యాలయాల్లో భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి అవుతుంది. భూమి అమ్మినా, కొన్నా వెంటనే వేలిముద్రల ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తయి పాస్‌బుక్‌లో పేరు ఎక్కిస్తున్రు. కాంగ్రెస్ ధరణి తీసేసి భూమాత పోర్టల్ ఏర్పాటు చేస్తామని చెబుతుంది. ధరణి తీసేస్తే మళ్లీ దళారులు దాపురిస్తరు. భూములు తారుమారు చేస్తరు. ధరణి ఉన్నందుకు మా భూములు సురక్షితంగా ఉన్నయి ఎటువంటి పైరవీలకు తావులేకుండా పక్కాగా భూముల నమోదు జరుగుతుంది. ధరణి లేకముందు తహసీల్దార్ కార్యాలయం, అధికారుల చుట్టూ తిరిగేటోళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దళారీల వ్యవస్థ పూర్తిగా తొలిగిపోయింది.

- రాగుట్ల నరేశ్, రైతు (రుద్రంగి)

రెవెన్యూ ప్రక్షాళన జరిగింది

గతంలో రైతులు రిజిస్ట్రేషన్ కోసం రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరిగాల్సివచ్చేది. ధరణి పోర్టల్ రద్దయితే గ్రామాల్లో రైతుల భూములకు భద్రత ఉండదు. వారిని దళారులు దోపిడీ చేస్తరు. కౌలుదారులు, అనుభవదారులు కాలం అంటూ రెవెన్యూ వ్యవస్థను మొదటికి తెస్తరు. రెవెన్యూ రికార్డులు తారుమారు చేస్తరు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారు. ధరణితో రెవెన్యూ వ్యవస్థలో ప్రక్షాళన జరిగింది. నేడు ఆ పరిస్థితి లేదు. వేలిముద్రల సహాయంతో అమ్మకం, కొనుగోలు వెంటనే జరిగిపోతున్నయి. తహసీల్దార్ కార్యాలయాల్లో భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పది నిమిషాల్లో పూర్తవుతుంది. ధరణి పోర్టల్‌తో భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ వెంటనే జరిగి బ్యాంక్ ఖాతాలో రైతుబంధు డబ్బులు పడుతున్నయి.

- నేరెళ్ల శ్రీనివాస్, రైతు (రుద్రంగి)

ధరణి వద్దనోళ్లను తరిమి కొట్టుడే

ధరణి పోర్టల్ కాంగ్రెసోళ్లు వద్దంటున్నరు. భూముల రికార్డులు అస్తవ్యస్తం చేసి రైతులను గోసపెడుతరు. మా భూముల వివరాలు ఇప్పుడే భద్రంగా ఉన్నయ్. పాత రోజులు మళ్లీ వస్తే రైతులు ఆగమైపోవల్ల. పంట పంటకు వచ్చే పెట్టుబడులు, బీమా సౌకర్యం ఏం గావాలే? రైతుల బ్యాంక్ ఖాతాలో ధాన్యం పైసలు పడయి. రైతు బీమా అందకుండా అయితది. భూముల కిరికిరి పెట్టుకుని పంచాయితీలతో ఎవుసం పక్కనబెట్టి ఆఫీసులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తింపుతరా? కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుల బతుకులు మారుతయా? ధరణి రద్దు చేస్తే పంట లెక్కలు సక్రమంగా ఉండలేదన్న సాకు సూపి ఎరువులు, విత్తనాలు అందకుండా జేస్తరు. వాటి కోసం మళ్లా చెప్పులు లైన్లో బెట్టి పోలీసోళ్ల దెబ్బలు తినుడు తప్పదు. సర్కార్ రైతు సంక్షేమ పథకాలు అందకుండా కాంగ్రెస్ చూస్తోంది. ఆ పార్టీకి అధికారం ఇవ్వకుండా రైతులు కేసీఆర్‌కు జై కొట్టాలే. కాంగ్రెస్‌ను తరిమితరిమి కొట్టాలే. ధరణిని ముట్టుకుని రైతుల జోలికి వస్తే సాగనంపాలె.

- వట్టిమల్ల రవి, రైతు, మూడపల్లి (చందుర్తి)

కాంగ్రెస్‌కు ఓటేత్తే సావు నోట్లె తలపెట్టినట్టే

నాకున్న మూడెకరాల పొలానికి నీరు పెడుదామంటే కరెంటు పాడుగాను కళ్లల్ల వత్తులేసుకుని సూత్తుంటిమి. బుక్కెడు తిండి తిందామన్నా..గింత చాయ్ దాగుదామన్న టెన్షన్ ఉండే. ఇగ వచ్చే అగ వచ్చే అంటూ ఊళ్లో రైతులందరం ఒక్కకాడ కూసుండి ముచ్చట పెట్టుకుందుం. కరెంటు వచ్చిందో అంటూ కేకలేసుకుంటూ బాయికాడికి ఉరుకుదుం. వాగొడ్డుకున్న బాయికాడికి పోయినోమో లేదో లోవోల్టేజీ తోటి మోటరు నడవక పోయేది. అటు ఇటు తండ్లాడి గంటసేపయినంక పోసిన నీళ్లతోటి గుంటన్న తడవలేదు. దిక్కుమల్ల కరెంటు జెయ్య వట్టె ఎక్కడికి పోరాలే. బయటి ఊర్ల ఎవరైన సుట్టపోడు సచ్చినా సూసేందుకు పోకుంటిమి. వానింట మన్నువడ గింత గోస పెడుతండును కుని బాధపడ్డం. పొలం వద్దనుకుని కూలీ పనిలో చేరినం. కలో గంజో తాగి ఎల్లదీసినం. ఏదో తెలంగాణ వచ్చినంక కరెంటు గోస తీరింది. 24గంటల కరెంటు ఇత్తండు. నాడే కరెంటు ఇయ్యనోడు ఇయ్యాల మళ్లచ్చి ఓటడిగితే ఎట్లేత్తం. మూడు గంటలు సాలని ఇప్పుడే గిట్లంటుండు. వచ్చినంక ఎంత గోసపెడతడో ఏమో. 10హెచ్‌పీల మోటరు పెట్టి పోత్తే బాయిలల్ల నీళ్లుండద్దా? ఉన్న నీళ్లు గుంజిపోత్తే రామగోస అయితది. కాంగ్రెసోన్ని నమ్ముకుంటే ఇగ మన్నుబుక్కుడే. ఎవుసం గురించి తెలువనోళ్లకు రాజ్యం చేతిలో పెడితే రైతుకు సావుమరణమే. బాగా ఆలోచించి ఓటేత్తం. మాకు మంచి జేసినోళ్లను మరిచి పోం.

- వనపట్ల సంజీవరెడ్డి, రైతు, అనుపురం (వేములవాడ రూరల్)

అద్దగంటల్ల పనైతంది..

నా పేరు కంచర్ల దేవయ్య. మాది రాజన్న సిరిసిల జిల్లా సిరిసిల్ల అర్బన్ మండలంలోని సర్దాపూర్ గ్రామం. నాకు నాలుగెకరాలు పొలం ఉన్నది. మా నాయిన పేరు మీదున్న భూమి నా పేరు మీద చెయ్యమంటే పట్వారీ ఇగజేత.. ఆగజేత అని ఏడాది తిప్పుకున్నడు.. ఏమి తిరుగుతవరా మీ నాయిన పేరే కదా ఉంటే ఉండనియ్యని మా పెద్దలు సర్దిచెప్పిండ్రు. అయినా గానీ చానాసార్లు పట్వారీ చుట్టూ తిరిగిన పట్టించుకోలే. మండలాఫీసుకు పోతే సార్లు పట్టించుకోరు. సార్లు ఉంటే పట్వారీ కలువడు. పట్వారీ ఉంటే సార్లు ఉండరు. గిట్లుండే నాటి రోజులు. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సారు రైతుల బాధలు చూసిండు. ఇట్లయితే కలవదని ధరణిని తెచ్చిండు. తెచ్చి పట్వారీలు, గిదవారీలు లేకుండా చేసిండు. ఆన్‌లైన్ల దరఖాస్తు పెట్టుకున్న వెంటనే పనైతాందని మా సర్పంచ్ చెప్పిండు. కాయితాలు అన్ని పట్టుకుని ఎమ్మార్వో ఆఫీసుకుపోతే అద్ద గంటలో పనైంది. మా నాయిన పేరు మీదున్న భూమి నా పేరు మీద ఎక్కింది. మంచిగున్న ఈ స్కీంను కాంగ్రెసోళ్లు మార్చతంటే ఊకునేదిలేదు. అళ్ల రాకముందే గిన్ని కథలు జెపుతున్నరు. మున్నుపు వాళ్లున్నప్పుడు పడ్డగోస చాలదా. మళ్లొత్తే నరకం సూపిత్తరు. ధరణి మంచిగున్నది. పైస ఖర్చులేకుండా పని అయితంది.

- కంచర్ల దేవయ్య, రైతు, సర్దాపూర్ (సిరిసిల్ల అర్బన్)